క్లుప్తంగా

నేడు మోదకొండమ్మ పండగ


ఆభరణాల అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల: వొమ్మలి గ్రామంలో మంగళవారం మోదకొండమ్మ పండగ అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. నేల వేషాలు, భారీ విద్యుత్ లైటింగ్, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ అమ్మవారి సంబరం సాగుతుందన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

కొత్తకోట హైస్కూల్ హెచ్ఎంగా బ్రహ్మాజి



రావికమతం: కొత్తకోట పెంటపాటి సూర్యారావు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా అదే గ్రామానికి చెందిన నవర బ్రహ్మాజి సోమ వారం బాధ్యతలు చేపట్టారు. పెందుర్తి మండలం శిరసపల్లి హైస్కూల్ నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఆర్డీవో స్పందనకు 21 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న ఏవో సూర్యనారాయణ

నర్సీపట్నం: రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 21 అర్జీలు వచ్చాయి. ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికార పర్యటన నేపథ్యంలో హాజరు కాకపోవడంతో కార్యాలయ ఏవో సూర్యనారాయణ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. డివిజన్‌లోని 12 మండలాల నుంచి 21 అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూసమస్యలు, ఇళ్ల స్థలాలు, సదరం సర్టిఫికెట్ల మంజూరు, తదితరవి ఉన్నాయి. వీటిని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఏవో హామీ ఇచ్చారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌కు పుస్తకాల వితరణ


క్లబ్ బాధ్యులకు పుస్తకాలు అందజేస్తున్న విశ్రాంత ఈవో

చోడవరం రూరల్: స్థానిక వాకర్స్ క్లబ్ కార్యాలయానికి రచయిత్రి రాయవరపు సరస్వతి సోమవారం 50 రకాల పుస్తకాలను వితరణగా అందజేశారు. వీటిల్లో ఆమె స్వీయరచనలతో పాటు, విజ్ఞాన, వినోదపరమైనవి ఉన్నాయి. రచయిత్రి భర్త విశ్రాంత ఈవో ఆర్.కన్నంనాయుడు క్లబ్ బాధ్యులకు అందజేశారు. వాకర్స్ క్లబ్‌లో సభ్యులకు ఉపకరించే విధంగా గ్రంథాలయ ఏర్పాటుకు తాను అందచేసిన పుస్తకాలు ఉపకరిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. వాకర్స్ క్లబ్ సభ్యులకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయని క్లబ్ ఉపాధ్యక్షుడు గుడివాడ అప్పారావు, సమన్వయకర్త టి.వి.రమణ అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు ఉప్పల శ్రీను, కాకి రామకృష్ణ, బొడిగ శ్రీను, చింతల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

రోలుగుంట హైస్కూల్ హెచ్ఎంగా బాబూలాల్


హెచ్ఎం బాబూలాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా ఎస్.డి.బాబూలాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఉపాధ్యాయులు అతనికి పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. ఇక్కడ పని చేసిన హెచ్ఎం అప్పారావు చౌడువాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాబూలాల్ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించి ప్రవేశాలు పెంచాలన్నారు.

ప్రతి విద్యార్థికి 'జగనన్న విద్యా కానుక'

- విద్యా సంవత్సరం ప్రారంభం రోజే పంపిణీ
- నాలుగేళ్లుగా ముందుగానే చేరుతున్న కిట్లు
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందం
- సందడిగా మారిన పాఠశాలలు

పాఠశాలల పునః ప్రారంభంతో విద్యార్థుల్లో సందడి నెలకొంది. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజే జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం కింద యూనిఫాం, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, బ్యాగ్, ఇంగ్లిష్, తెలుగు (బైలింగ్వల్) టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీ, నోటు పుస్తకాలు అందుకుని మురిసిపోతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.


దేవరాపల్లి: బేతపూడి కేజీబీవీలో విద్యార్థినులకు కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి నిండైన భరోసా కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబు అధ్యక్షతన సోమవారం బేతపూడి కేజీబీవీలోని మండల స్థాయిలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావులతో కలిసి వారు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సైతం అధునాతన సౌకర్యాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఎంపీపీ రాజేశ్వరి మాట్లాడుతూ విద్యతోనే పేదరికం నిర్మూలన సాధ్యమన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, బూరె బాబూరావు మాట్లాడుతూ విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి విద్యకు తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తుందన్నారు. అనంతరం టెన్త్ ఫలితాల్లో 560 మార్కులు సాధించిన కేజీబీవీ విద్యార్థిని ఎస్. వెంకటలక్ష్మిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, సర్పంచ్ చల్లా లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉగ్రాకుల అప్పారావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి శశి పాల్గొన్నారు.

చోడవరం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సోమవారం విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. చోడవరం పట్టణంలో జి. స్ట్రీట్ స్కూల్‌లో 110 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ నారం ప్రసాద్, వైస్ చైర్మన్ బొగ్గు శాంతికుమారి, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఎంపీటీసీ పొట్నూరి అరుణ పాల్గొన్నారు. లక్ష్మీపురం హైస్కూల్‌లో 300 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. సర్పంచ్ శిరుచోళ్ల గణపతినాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ భూతనాథుని రామారావు పాల్గొన్నారు.


మాడుగుల: ఎం. కోడూరు హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు


బుచ్చెయ్యపేట: పాఠశాల అనంతరం బయటకు వస్తున్న విద్యార్థినులు

మాడుగుల: ప్రభుత్వ పాఠశాలలన్నీ విద్యార్థులతో సందడిగా మారాయి. సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా మండలంలో 6,302 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు సిద్ధం చేశారు. తొలిరోజు కొంత మందికి పుస్తకాలు పంపిణీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 7.30 నుంచి 11.30 గంటలకు ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నారు.

కె.కోటపాడు: జగనన్న విద్యా కానుక విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే నాలుగేళ్లుగా అందజేస్తున్నట్టు హెచ్ఎం సూర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎ.భీమవరం ప్రాథమిక పాఠశాలలో విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. పీఎంసీ కమిటీ చైర్మన్ తాడి నాగలక్ష్మి పాల్గొన్నారు. అదేవిధంగా చౌడువాడ హైస్కూల్‌లో హెచ్ఎం ఈర్లి అప్పారావు ఆధ్వర్యంలో విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో పాఠశాలలు సోమవారం తెరుచుకున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ఆరంభం రోజున 56 శాతం మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. మండలంలో 63 ప్రభుత్వ, 12 ప్రైవేటు మొత్తం 75 పాఠశాలలు ఉన్నాయి. 5,836 మంది విద్యార్థులకుగాను మొదటి రోజు 3,426 మంది పాఠశాలలకు హాజరయ్యారు. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కొత్త విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల బదిలీల హడావుడి కనిపించింది.

చీడికాడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించి ఎంతో మేలు చేకూర్చారని సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్ములు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. సోమవారం వరహాపురం ప్రభుత్వ పాఠశాలలో వారు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది.


కె.కోటపాడు: విద్యార్థులకు కిట్లు అందిస్తున్న హెచ్ఎం శ్రీనివాస్, పీఎంసీ చైర్మన్ నాగలక్ష్మి


చీడికాడ: వరహాపురంలో విద్యా కానుక అందిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు రాజుబాబు, సిబ్బంది


లక్ష్మీపురం హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


చోడవరం జి. స్ట్రీట్ స్కూల్‌లో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం బూడి, మంత్రి గుడివాడ


భవనాల ప్రారంభోత్సవంలో మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, ఎమ్మెల్యే గణేష్, కలెక్టర్

నాతవరం : స్వాతంత్ర్యం వచ్చాక ఎవరూ చేయలేనంతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండల కేంద్రంలో రూ.కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన భవనాలను స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గిరిజన గ్రామాలన్నింటికీ నెల రోజుల వ్యవధిలో మట్టి రోడ్లు ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించారు.

ఎమ్మెల్యే తమ దృష్టికి తీసుకువచ్చిన నియోజకవర్గ ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పీహెచ్‌సీలో రూ.కోటీ 65 లక్షలతో అదనపు భవనం, రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.25 లక్షలతో రెండవ అంతస్తు, రూ.21 లక్షలతో ఆర్బీకే, రూ.10 లక్షలతో శ్రీనల్ల కొండమ్మ తల్లి ఆలయ పనుల్ని మంత్రులు ప్రారంభించారు. రూ.31 లక్షలతో నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బాలసుందరం, వ్యవసాయ శాఖ జేడీ మోహన్‌రావు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో వీరజ్యోతి, పశుసంవర్ధక శాఖ జేడీ వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బి.సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు తమరాన నాయుడు కోనేటి రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అంట్లంపాలెంలో ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

రావికమతం: గంపవానిపాలెం శివారు అంట్లంపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. సర్పంచ్ రొంగలి రామకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్ రాజు, ఎంపీపీ పైల రాజు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మండల ఇన్‌చార్జి రాజాన కొండనాయుడు, తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం ప్రారంభం


స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

రావికమతం: కొత్తకోటలో రాధాకృష్ణ ఆలయ నాల్గో వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ, భజన మండలి సభ్యులు, మహిళలు స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తుడు కేదారిశెట్టి భవానీకృష్ణ లావణ్య దంపతులతో మంగళవారం స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తామని పేర్కొంది.

రోడ్డు విస్తరణ న్యాయబద్ధంగా చేయాలి

- ఆటో యూనియన్ నాయకుల ర్యాలీ
- పలువురు సంఘీభావం


మానవహారంగా ఏర్పడ్డ ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు

రావికమతం: కొత్తకోట మెయిన్ రోడ్డు విస్తరణ పనులు న్యాయబద్ధంగా చేపట్టాలని, ఇష్టానుసారంగా మార్కింగ్ తగదని కొత్తకోట శ్రీశాంతి ఆటో యూనియన్ సభ్యులు కోరారు. సోమవారం ఇక్కడ భారీ ర్యాలీ నిర్వహించి మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. వీరికి పలువురు నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, గ్రామస్తులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోనలోవరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, ఎంపీటీసీ పూడి దేవ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శీలం శంకరరావు, శివాలయ కమిటీ చైర్మన్ గుమ్ముడు దొరబాబు మాట్లాడుతూ నర్సీపట్నం నుంచి భీమునిపట్నం వరకు ప్రధాన రహదారి విస్తరణ 15 ఏళ్ల క్రితమే చేశారని, అప్పట్లో కొన్ని కారణాలు వల్ల కొత్తకోటలో వదిలేశారన్నారు. దీంతో ఇరుకు రోడ్డులో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. ఈ దృష్ట్యా ప్రస్తుతం చేపట్టే రహదారి విస్తరణ పారదర్శకంగా ఉండాలని, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా చేయాలని తాము ఇదివరకే అధికారులను కోరామన్నారు. సర్వేలో మాత్రం మార్కింగ్ ఇష్టానుసారంగా ఇవ్వడం వల్ల ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దాంతో రోడ్డుకు ఇరువైపులా 40 అడుగుల మేర మార్కింగ్ చేయాలని, రోడ్డు ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగిపోవాలని ఆయన ఆదేశించారన్నారు. త్వరలోనే ఆ విధంగా మార్కింగ్ ఇస్తారన్నారు. ఇక్కడ ఇబ్బందులపై ర్యాలీ, మానవహారం రూపంలో మంగళవారం నుంచి దశల వారీగా శాంతియుత ఆందోళన చేస్తామని ఆటో యూనియన్ నాయకులు బుల్లిబాబు, సత్తిబాబు, శేఖర్ తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పూడి అర్జున మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులను కొంత మంది స్వార్థపరులు ఆపాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భీమరాతి వెంకట్, శీలం రాజేష్, తలారి రవి, మల్లి కృష్ణ పాల్గొన్నారు.

బయట వైద్యానికి పసికందు

- ఏరియా ఆస్పత్రి సిబ్బంది నిర్వాకంపై బంధువుల ఆందోళన


ప్రసూతి సిబ్బంది తీరును వైద్యురాలు సువర్ణకు వివరిస్తున్న బాలింతరాలు హరిప్రియ

నర్సీపట్నం: మూడు రోజుల పసికందును వైద్యానికి బయటకు పంపటంపై బంధువులు స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. బాధితుల వివరాల మేరకు.. మాకవరపాలెంకు చెందిన లాలం హరిప్రియ ఇక్కడ రెండు రోజుల క్రితం సాధారణ ప్రసవం పొందింది. సోమవారం ఉదయం వైద్య సిబ్బంది సూచన మేరకు ప్రైవేట్‌గా బిడ్డకు టెస్టులు చేయించారు. వాటిని పరిశీలించిన వైద్యులు కామెర్లు ఉన్నందున ఏరియా ఆస్పత్రిలోని స్పెషల్ న్యూబోరన్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)కు తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే ఆ యూనిట్‌కు వెళ్తే ఖాళీ లేదు... మేడపైన ఎమర్జెన్సీ యూనిట్‌కు వెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. అక్కడ ఖాళీ లేదనడంతో కింద ఉన్న ఎస్ఎన్‌సీయూకు వస్తే.. బయటకు తీసుకుపోవాలన్నారు. ఆర్థిక స్థోమత లేని భార్యాభర్తలు హరిప్రియ, లోవకుమార్ డబ్బులు అప్పు చేసుకుని బిడ్డను ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి రూ.4 వేలు చేతి చమురు వదిలించుకున్నారు. విషయం తెలుసుకున్న బంధువులు ఆస్పత్రికి చేరుకుని అన్ని సౌకర్యాలు ఉండగా, ఎందుకు బయటకు పంపించారని నిలదీశారు. దీంతో ప్రసూతి వార్డు వద్ద గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇంతలో నైట్ డ్యూటీ వైద్యురాలు సువర్ణ కల్పించుకుని బంధువులను వారించి బిడ్డకు ఎస్ఎన్‌సీయూలో చేర్పించి వైద్య సేవలందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

బండిబాట ఆక్రమణపై రైతుల ఆందోళన


ఆర్డీవో కార్యాలయం ఆందోళన చేస్తున్న రైతులు

నర్సీపట్నం: బండిబాట ఆక్రమణపై నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన రైతులు ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రావణాపల్లి జలాశయం మాజీ చైర్మన్ లాలం అప్పారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, రైతులు మాట్లాడుతూ నర్సీపట్నం రెవెన్యూ గ్రామం పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా వందెకరాల సాగు భూములకు బ్రిటీష్ కాలం నుంచి బండిబాట ఉందన్నారు. ఇదే వ్యవసాయ ఉత్పత్తులు, వ్యవసాయ పనులు, ఎరువులు మార్కెట్‌కు తరలించుకునేందుకు ప్రధాన ఆధారమన్నారు. 1.50 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన అప్పారావు, రాజుల భూమితోపాటు బండిబాటను చదును చేశారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. ఆక్రమణదారుడుపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని స్పందనలో ఫిర్యాదు చేశారు.

18న రైతు కూలీ జిల్లా మహాసభ


మహాసభ కోసం వివరిస్తున్న మోహన్‌రావు

కె.కోటపాడు: అనకాపల్లిలో ఈ నెల 18న తలపెట్టిన రైతు కూలీ సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు కోరారు. చౌడువాడలో రైతులను కలిశారు. జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారం, షుగర్ ఫ్యాక్టరీల పరిరక్షణతోపాటు పాడి రైతులకు మంచి మద్దతు ధర కోసం సభలో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు పైల రమేష్, గొర్లి రాజు, కోమార వెంకటరమణ, వేచలపు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్


కసిమి గ్రామంలో లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: అర్హతే కొలమానంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కసిమి గిరిజన గ్రామంలో సోమవారం ఆయన ఇంటింటికీ తిరిగారు. కసిమి, చినకసిమి, దోనిపాలెం, వడపర్తి, జమ్మువరం గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంటికి వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హులకే న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. వీటి ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నూరుశాతం నెరవేర్చుతున్నారన్నారు. పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తమదే అన్నారు. ఇక్కడ గిరిజన గ్రామల్లో ప్రజల ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, సర్పంచ్ దేవి స్వరూపరాణి, మాజీ సర్పంచ్ శ్రీను, స్థానిక నాయకులు కసిమి రమణ, సచివాలయం కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పాణీశాంతారామ్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతులు చేయాలని డిమాండ్

రోలుగుంట: ధ్వంసమైన పైపులైను మరమ్మతులు చేయకుంటే స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద వంటా వార్పు కార్యక్రమాన్ని బాధిత గ్రామస్తులతో చేపడతామని సీఐటీయూ నాయకుడు గోవింద హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన ఫ్లోరైడు ప్రభావిత గ్రామాల్లో తలెత్తిన తాగునీటి సమస్య గురించి మాట్లాడారు. వెలంకాలయపాలెం నుంచి రోలుగుంట వరకు బీఎన్ రోడ్డు పనుల నేపథ్యంలో తాగునీటి పైపులైను ధ్వంసమైందన్నారు. దీంతో ఫ్లోరైడు ప్రభావిత గ్రామాలైన నిండుగొండ, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, అంట్లపాలెం, కిలపర్తిపాలెం, మునిపల్లి తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని వాపోయారు. ఎనిమిది రోజులు దాటుతున్నా సంబంధింత అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. తక్షణమే స్పందించాలని, లేదంటే పలు రూపాల్లో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

ఆర్లిలో 136 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వల్ల ఆరోగ్య జాగ్రత్తలను తీసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 136 మందికి ఓ.పి ద్వారా వైద్యం అందించడంతోపాటు బి.పి, సుగర్ పరీక్షలు చేశారు. అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కుసుర్లపూడిలో 'గడప గడపకు'

రోలుగుంట: కుసుర్లపూడిలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుంటారన్నారు. అన్ని గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

చోడవరం: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమతంగా ఉండాలంటూ ఏపీఎం ఎం. కనకరాజు తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గోవిందమ్మ కాలనీలో డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. విధిగా హెల్మెంట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మాకవరపాలెం: చెత్త తరలింపుతో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మాకవరపాలెం పంచాయతీలోని చౌడు గెడ్డ వద్ద వేసిన చెత్తను తొలగించి వేరొక చోట వేశారని, మళ్లీ అదే చెత్తను మరో చోటకు తరలించి రూ.3.80 లక్షలు పక్కదారి పట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.